రేపు 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఆర్ట్ ఆఫ్ హ్యాపీ లివింగ్' అనే అంశంపై గుర్‌గావ్‌లోని బీకే మెడిటేషన్ సెంటర్ ఇన్‌చార్జ్ బి.కె.,భావనా ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

త్వరలో వైద్య కళాశాల ప్రారంభిస్తాం

'మనూ' రిజిస్ట్రార్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ఒక వైద్య కళాశాలను ప్రారంభించాలని యోచిస్తోందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ శుక్రవారం తెలిపారు. ఈ సంవత్సరం నుంచి 'మనూ'లో అనుబంధ ఆరోగ్య శాస్త్రాలు (ఎంఎల్‌టీ)లో పీహెచ్‌డీ కోర్సు, కాలిగ్రఫీ, తెలుగు, టర్కిష్, ఉర్దూలో నాలుగు డిప్లొమో కోర్సులను ప్రవేశపెడుతోందన్నారు. అంతేకాకుండా బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ(సివిల్ ఇంజనీరింగ్) కోర్సును కూడా సెల్ఫ్ ఫైనాన్సింగ్ మోడ్ ద్వారా ప్రవేశ పెడుతోందన్నారు.

ఆడపడుచులకు అండగా కల్యాణలక్ష్మి

మియాపూర్: ప్రజా సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శేరిలింగంపల్లి మండల పరిధిలోని లబ్ధిదారులకు కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, మంజుల రఘునాథ్‌రెడ్డి, నార్నే శ్రీనివాస్‌లతో కలిసి ఆయన చెక్కులను పంపిణీ చేశారు. పేదింటి ఆడపడుచులకు అండగా కళ్యాణలక్ష్మీ, షాదీముభారక్ ఉన్నదని తెలిపారు. అధికారులు ఆర్ఐ శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

మనూలో నూతన కమిటీ ఎన్నిక

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్(నాన్ టీచింగ్ స్టాఫ్) అధ్యక్షుడుగా షేక్ నవీద్ మరోసారి ఎంపికయ్యారు. రెండేళ్ల కాల పరిమితి కోసం ఈ అసోసియేషన్ ఎన్నికలను నిర్వహిస్తారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన షేక్ నవీద్ శుక్రవారం వివరించారు. వరుసగా ఆయన అధ్యక్షుడిగా ఎంపిక కావడం మూడవ సారి కాగా మొత్తం మీద ఇది అయిదవసారి కావడం విశేషం. కాగా ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ షానవాజ్‌అలీఖురేషి ఎంపికయ్యారు. ఆయన కూడా వరుసగా మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు.

సుల్తానా బేగం మృతదేహానికి పోస్టుమార్టం పూర్తి

గచ్చిబౌలి: ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సుల్తానా బేగం మృతదేహనికి ఉస్మానియా ఆస్పత్రిలో శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. గురువారం ఉదయం బంజారానగర్‌లో ప్రియుడు నివాసం ఉంటున్న భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. నిమ్స్ హిస్పటల్ నుంచి ఉస్మానియాకు తరలించి మృతదేహనికి బంధువుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అంత్యక్రియల నిమిత్తం అస్సాంకు మృతదేహన్ని తరలించారు. మూడేళ్ల పాటుప్రేమించి పెళ్లి చేసుకోనని మోసానికి పాల్పడి సుల్తానా బేగం మృతికి కారణమైన సహిదుల్లా షేక్(26)ను రాయదుర్గం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా బీజేపీ అధ్యక్షురాలు సి.గోదావరి అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం పట్టణంలోని ఆమె నివాసంలో ఎద్దుమైలారం గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బీజేపీ శక్తివంతంగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేశ్వర్ రావు దేశ్‌పాండే, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్ కుమార్, అరుణ్, ఓంకార్, అభిలాష్, శివకుమార్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు పదోన్నతులు

మణికొండ: నార్సింగి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న ఆరుగురికి పదోన్నతులు లభించాయి. ఉత్తర్వులతో పాటు హెడ్ కానిస్టేబుల్ బ్యాచ్‌లను శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్‌రెడ్డి అందజేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... తమ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సత్యకుమార్, విద్యాసాగర్, శ్రీనివాస్, సుదర్శన్‌రెడ్డి, సుధాకర్, నరేందర్‌లకు ఒకే సారి పదోన్నతులు రావటం సంతోషకరమన్నారు. పదోన్నతి పొందిన ఉత్సాహంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో ప్రజలకు మరింత సేవలు అందించాలన్నారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

భక్తులతో కిటకిటలాడిన కల్వారి ప్రాంగణం ● కన్నీళ్లు తెప్పించిన క్రీస్తు శిలువ ప్రదర్శన

చందానగర్: గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని శుక్రవారం మియాపూర్‌లోని కల్వారి టెంపుల్‌లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్వారి టెంపుల్ వ్యవస్థాపకులు డాక్టర్ పి.సతీష్ కుమార్ ఏసుప్రభు ప్రేమ త్యాగం కనికరం దయ క్షమాపణ గురించి వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం క్రీస్తు జననం, శిలువ ప్రదర్శనను గురించి వివరిస్తు క్రీస్తు సందేశాలను భక్తులకు తెలియజేశారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు శిలువ ప్రదర్శన, క్రీస్తు జన్మనాటికను భక్తులకు కండ్లకు కట్టినట్లుగా ప్రదర్శించారు.

కిటకిటలాడిన కల్వారి టెంపుల్ ఆవరణ

తెల్లవారుజామున నుంచి కల్వారి టెంపుల్‌కు పెద్ద ఎత్తున భక్తులు, క్రైస్తవులు భారీగా తరలివచ్చారు. రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నాలుగు ఆరాధన మహోత్సవాలను నిర్వహించారు.

మియాపూర్‌లోని కల్వారి టెంపుల్‌కు వచ్చిన జనం









యేసుక్రీస్తు శిలువపై ప్రత్యేక ప్రదర్శనలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మియాపూర్: మియాపూర్ మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 9 గంటల నుండి 11 గంటల వరకు జనప్రియ వెస్ట్‌సిటీ, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, పీఏ నగర్, కృషినగర్, హెచ్‌ఎంటీ స్వర్ణపూరి కాలనీ రోడ్డు -1 నుండి 14 వరకు, స్టాలిన్‌నగర్, ప్రశాంత్ నగర్, రాఘవేంద్రపాంచజన్య అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

చందానగర్: చందానగర్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సీఎం తోట, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో ప్రకాశ్‌నగర్, వినాయక్‌నగర్, అక్షయ ఈలైట్ అపార్ట్‌మెంట్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

హఫీజ్‌పేట్ సెక్షన్ పరిధిలో..

హఫిజ్‌పేట్ సెక్షన్ పరిధిలోని హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు యూత్ కాలనీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, వార్డ్ ఆఫీస్, గ్రీన్ బవార్చి ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

- మాధవ్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 గంటల నుంచి 11.00 గంటల వరకు జీఎస్టీ ఆఫీస్ దగ్గర ఉన్న ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వేమనకాలనీ సెక్షన్‌లో..

వేమన కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 వరకు ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్ రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- శంకర్‌నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10.00 నుంచి 10.30 వరకు గౌతమీనగర్, వార్డు కార్యాలయం, బజాజ్ ఎలక్ట్రానిక్స్, శిల్పా ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 03.00 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శాంతినగర్, ఉషోదయా అపార్ట్‌మెంట్స్ రోడ్డు, ధర్మపురి టెంపుల్ రోడ్డు, దీప్తిశ్రీనగర్ రోడ్ నెంబర్ 14 నుంచి 25 వరకు, ఆదర్శనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

తారానగర్ సెక్షన్ పరిధిలో..

- తారానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు వెంకట్‌రెడ్డి కాలనీ, పోచమ్మ టెంపుల్ వెనకాల, వెంకటాద్రినగర్, పీజేఆర్ స్టేడియం ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- హుడా కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02.00 గంటల నుంచి సాయంత్రం 05.00 వరకు హుడా కాలనీ, జాకబ్ బేకరీ, వాటర్ ట్యాంక్, పార్కు వెనకాల, ఎంఎంటీఎస్ స్టేషన్ రోడ్డు, ఆర్ఎస్ బ్రదర్స్ మెయిన్ రోడ్డు ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

చెరువులను సుందరీకరిస్తాం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్: నియోజకవర్గంలోని అన్ని చెరువులను అభివృద్ధిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. డివిజన్ పరిధిలోని పటేల్ చెరువు, గురునాథం చెరువు, మక్తమహబూబ్‌పేట్‌లోని పెద్దకుడి చెరువు, రేగులకుంట సుందరీకరణ పనులను జోనల్ కమీషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. పటేల్ చెరువు, గురునాథం చెరువు, పెద్ద కుడి చెరువు, రామసముద్రం కుంట చెరువు, నాయినమ్మ కుంట చెరువుల దశ..దిశ మారనుందన్నారు. నెక్సెస్ మాల్ కంపెనీ, ఐజీయూఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా మల్లిగావాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చెరువులన్నీ సుందరీకరణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, కాలనీ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, సంస్థ ప్రతినిదులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ పరిశీలన..

దీప్తీశ్రీనగర్ కాలనీ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌ను జోనల్ కమీషనర్ ఉపేందర్ రెడ్డి, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పరిశీలించారు.

గచ్చిబౌలి: కుడికుంటను పూర్తి స్థాయిలో సుందరీకరణ చేసి అందుబాటులోకి తీసుకొస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మసీద్‌బండలోని కుడికుంటను జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. మురుగు నీరు చెరువులో కలువకుండ చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



మియాపూర్‌లో చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఎఫ్‌డీడీఐలో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

రాయదుర్గం: కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ పర్యవేక్షణలో నిర్వహించే ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్‌లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు గడువు తేదీని పొడిగించారు. ఈనెల 20 వరకు ఉన్న గడువును ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ అధికారులు శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే చేయాల్సి ఉంటుంది. వివరాలకు 9440471336 నెంబరుకు ఫోన్ చేయవచ్చు.

రాహుల్‌గాంధీతో సమావేశం



రాహుల్‌గాంధీతో సమావేశమైన ఏఐఓబీసీఎస్‌ఏ నాయకులు

రాయదుర్గం: అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ, తెలంగాణ, హెచ్‌సీయూ కమిటీ నాయకుల బృందం శుక్రవారం న్యూఢిల్లీలో కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశమ య్యారు. ఏఐఓబీసీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి జి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ కన్వీనర్, న్యాయవాది పంకజ్‌కుమార్‌కుష్వా, జాతీయ ప్రధాన కార్యదర్శి రితూ, ఉపాధ్యక్షుడు పుష్పరాజ్,బాబాసాహెబ్ అంబేడ్కర్ ఇంజనీర్ల సంఘం ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. రిజర్వేషన్ల అమలు, విశ్వవిద్యాలయాల్లో బోధనా ఉద్యోగాల నియమకాల్లో రోస్టర్ లోపాలు, సామాజిక న్యాయానికి సంబంధించిన కీలక సమస్యలు ఆయనకు వివరించినట్లు తెలిపారు.

కాంగ్రెస్‌నే నమ్ముకున్నాం.. న్యాయం చేయండి...



మీనాక్షి నటరాజన్‌ను కలిసిన మణికొండ కాంగ్రెస్ నాయకులు

మీనాక్షి నటరాజన్‌ను కోరిన మణికొండ నాయకులు

మణికొండ: దశాబ్దకాలంపాటు బీఆర్ఎస్ నిరంకుశ పాలనకు ఎదురొడ్డి నిలబడి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు న్యాయం చేయాలని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్‌ను మణికొండ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆమెను, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించామని వారు వెల్లడించారు. పార్టీకి కష్ట కాలంలో అండగా ఉన్న వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని కోరామన్నారు. లేదంటే రాబోయే రోజుల్లో పార్టీకి నాయకులు, కార్యకర్తలు దూరం అయ్యే పరిస్థితి వస్తుందని వివరించామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కె. నరేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కష్టపడి పనిచేశామన్నారు. గత ఎన్నికలలో నియోజకవర్గంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సి ఉందని, వాటిని త్వరగా మంజూరు చేయాలని కోరామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ మైనార్టీ అధ్యక్షుడు హాజీ తదితరులు పాల్గొన్నారు.

'తల్లిదండ్రులను ఇంట్లోకి రానిస్తాం'

- తల్లి, అక్క మంత్రాలు చేయించారు
- దేవాలయంలో ప్రమాణం చేయాలి
- వృద్ధ దంపతులు బాలమల్లయ్య, శారదల కుమారులు




క్షుద్రపూజల చిత్రాలను చూపుతున్న బాలరాజు, శివకుమార్ దంపతులు

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: మంత్రాలు చేసి తమ కుమారుడి మృతికి కారణమయ్యారనే కోపంతో తల్లితండ్రులను ఇంట్లోంచి వెళ్లగొట్టిన కొడుకులు దిగి వచ్చారు. వారి ఇంటికి వారు రావచ్చని, తమ అమ్మ, అక్కలు మంత్రాలు చేసింది మాత్రం నిజమని, అందుకు తగ్గ సాక్ష్యాలు తమ వద్ద ఫొటోలు, వీడియోల రూపంలో ఉన్నాయని వారు వాదిస్తున్నారు. సాక్ష్యాల ఆధారంగా అపుడే నార్సింగి పోలీసులకు తాము ఫిర్యాదు చేశామని తెలిపారు. గురువారం 'సాక్షి' దినపత్రికలో 'మంత్రాల నెపంతో గెంటేశారు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి వృద్ధుల కుమారులు స్పందించారు. శుక్రవారం వారి నివాసంలో 'సాక్షి'తో మాట్లాడుతూ... తమ తల్లితండ్రులు ఇంట్లో ఉండొద్దని తాము భావించటం లేదన్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో వారు ఉంటున్న ఇంట్లో, ఇంటి ముందు కొన్ని యంత్రాలు, పేర్లు, తమ ఫొటోలను నిమ్మకాయలు, పసుపు, కుంకుమలతో కలిపి పాతిపెట్టారన్నారు. ఆ విషయం తమ ఇంటి చుట్టు పక్కల వారితో పాటు గ్రామ నాయకులు వచ్చి చూశారన్నారు. ఎలాంటి అనారోగ్యం లేకుండానే ఒక రోజు వ్యవధిలోనే తన కుమారుడు మృతి చెందటంతో తమ అనుమానాలు మరింత పెరిగాయని వృద్ధ దంపతులు బాలమల్లయ్య, శారదల కుమారుడు బాలరాజు అన్నారు. తమ అక్క, తమ అమ్మతో ఇవ్వన్నీ చేయించిందని, తండ్రికి ఏపాపం తెలియదన్నారు. వారు ఫిర్యాదులు చేసిన ఆర్‌డీఓ, తహసీల్దార్, పోలీసులకు తమ వద్ద ఉన్న ఆధారాలతో వాదనను వినిపించామన్నారు. వారి పింఛన్ డబ్బులు, అద్దె డబ్బులు తాము ఒక్క రూపాయి తీసుకోలేదని, తమ అక్కకే రూ. 5 లక్షలు ఇచ్చారన్నారు. పింఛన్ పత్రాలను రెన్యువల్ చేయించేందుకే తీసుకున్నామని, పింఛన్ డబ్బులు అకౌంట్‌లో పడతాయని, తమ తండ్రి వెళ్తేనే ఇస్తారని స్పష్టం చేశారు. వారు ఎపుడు వచ్చినా ముందుగా గుడిలో తమపై ఎలాంటి క్షుద్ర పూజలు చేయలేదని ప్రమాణం చేస్తే తమకు ఉన్న అనుమానాలు పోతాయని వారి ఇద్దరి కుమారులు, కోడళ్లు స్పష్టం చేశారు.

ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీజేపీదే విజయం

రాయదుర్గం: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాషాయ జెండా ఎగురడం ఖాయమని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి స్పష్టం చేశారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవ ఉత్సవాల సందర్భంగా గచ్చిబౌలి డివిజన్‌లోని డైమండ్ హట్స్‌లో బీజేపీ గావ్ చలో బస్తీ చలో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్ యాదవ్‌తో కలిసి ఆయన చీపుర్లతో కాలనీలో రోడ్లను ఊడ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన పలు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శివాసింగ్,నాయకులు వసంత కుమార్‌యాదవ్,రంజిత్, హన్మంత్‌నాయక్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

డంపింగ్ యార్డ్ పనులు నిలిపివేయాలి



నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు

73వ రోజుకు చేరుకున్న నిరాహార దీక్షలు

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వం కాలయాపన చేయకుండా డంపింగ్ యార్డ్ పనులను నిలిపివేయాలని జేఏసీ, పలువురు నాయకులు డిమాండ్ చేశారు. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాలు శుక్రవారం 73వ రోజుకు చేరుకున్నాయి. జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో గుమ్మడిదల మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, రైతు నాయకులు సదానంద రెడ్డి, బాల్‌రెడ్డి పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయం వెలువడే వరకు తమ న్యాయ పోరాటాన్ని ఆపేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, మంద భాస్కర్ రెడ్డి, సూర్యనారాయణ దేవేందర్ రెడ్డి సత్యనారాయణ, మోహన్ రెడ్డి, మల్లేష్ గౌడ్, రైతులు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానవ రహిత వ్యవసాయం దిశగా పరిశోధనలు జరగాలి

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య

ఏజీవర్సిటీ: పర్యావరణ పరిరక్షణ... మానవ రహిత వ్యవసాయం దిశగా వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం శుక్రవారం వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ... మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థలు, వ్యవస్థలూ మారాలన్నారు. సవాళ్లను విజయవంతంగా ఎదుర్కొనేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఎప్పటికప్పుడు పునర్‌వ్యవస్థీకరణ చర్యలు చేపడుతున్నదని అన్నారు. ఒకప్పుడు ఆహార భద్రత కోసం అధిక దిగుబడి విధానాలను అవలంభించామన్నారు. అందుకోసం నీటి పారుదల ప్రాజెక్టులు నిర్మించి, ఎరువుల ఫ్యాక్టరీలను విరివిగా స్థాపించామని వీసీ వివరించారు. అందువల్ల నేడు అన్ని ఆహార ధాన్యాల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందన్నారు. 1947–50 మధ్య కాలంలో దేశం సాధించిన దిగుబడులను నేడు తెలంగాణ ఒకటే సాధిస్తున్నదన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు ఉత్పత్తి పెరుగుదల కారణంగా ప్రస్తుతం కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని వీసీ పేర్కొన్నారు. సహజ వ్యవసాయ పద్ధతులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్లు, రోబోటిక్ టెక్నాలజీ వినియోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆ దిశగా పరిశోధనలు సాగాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం, బోధన సిబ్బంది, శాస్త్రవేత్తలు, రైతులు, ఉద్యాన అధికారులు పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం వివిధ అంశాలపై రూపొందించిన సీడీలను ఆవిష్కరించారు.



సీడీలను ఆవిష్కరిస్తున్న వీసీ, అధికారులు

ప్రజావసరాలకు భూములివ్వండి

బీఆర్ఎస్ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు సీతారాం

మణికొండ: రాష్ట్రంలో ఐటీ పరిశ్రమ విస్తరించటం, లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించే క్రమంలో మణికొండ మున్సిపాలిటీ, పుప్పాలగూడలో ఐటీ హబ్‌కు 450 ఎకరాల భూములు ఇవ్వటం బాగానే ఉన్నా స్థానికంగా ఉన్న ప్రజల అవసరాలకు తగిన రీతిలో భూములు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపల్ అధ్యక్షుడు డి. సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి గుడ్ మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో భాగంగా సెక్రటేరియట్ కాలనీలో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలో జీహెచ్‌ఎంసీ కంటే రెండు రెట్లు ఎక్కువ పన్నులు వసూలు చేస్తున్నా సౌకర్యాలు మాత్రం లేవన్నారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు అవసరమైన కూరగాయల మార్కెట్, బస్ డిపో, అగ్నిమాపక కేంద్రం, జూనియర్ కళాశాల, వీధి కుక్కల షెల్టర్, తాగునీటి రిజర్వాయర్‌లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణాలకు స్థలాల అవసరం ఎంతో ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు ఎన్ని సార్లు తమకు స్థలాలు కేటాయించాలని కోరినా ఇవ్వలేక పోతున్నారనే విమర్శలు వస్తున్నాయన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రజావసరాలకు సరిపడా స్థలాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ కాలనీలో వీధి దీపాలు సరిగా వెలగటం లేదని, ఆకతాయి పిల్లలు గంజాయి సేవించి ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారని, రాత్రి సమయంలో మహిళలు, వృద్ధులు బయటకు వచ్చేందుకు జంకుతున్నారన్నారు. విద్యుత్ సరఫరా హెచ్చుతగ్గుల సరఫరాతో గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, ప్రధాన కార్యదర్శి జి.నరేందర్, నాయకులు బి.బాబు, మాల్యాద్రి నాయుడు, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, కిరణ్, మల్లేష్, సుమనళిని తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పైప్‌లైన్. నేడు నీటి సరఫరా బంద్



మణికొండ: సింగూరు ప్రాజెక్ట్ నుంచి హైదరాబాద్ నగరానికి మంచినీటి తరలించే పైప్‌లైన్ శుక్రవారం మధ్నాహ్నం శంకర్‌పల్లి మండలం, పెద్దాపూర్ వద్ద పగలిపోయిందని జలమండలి మేనేజర్ రామకృష్ణారెడ్డి తెలిపారు. దాంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం సాయంత్రం వరకు నీటి సరఫరా అంతారాయం కలుగుతుందని ఆయన వివరించారు. ప్రజలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని, నీటిని పొదుపుగా వాడాలని ఆయన కోరారు.